క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసల అహ్మద్ శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. జుగాడ్ సిస్టం ద్వారా దీన్ని ఏర్పాటు చేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వేసవిలో ప్రజలు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పరిశీలన

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం రైతు భరోసా కేంద్రంలో ఉన్న విత్తన వేరుశనగను జిల్లా రైతు సంఘం నాయకులు కేవీ చలపతి, సహాయ కార్యదర్శి గోవిందరెడ్డి శుక్రవారం ఉదయం పరిశీలించారు. విత్తన కాయ నాణ్యతపై అధికారులతో ఆరా తీశారు. నాణ్యత లేని వేరుశనగను రైతులకు పంపిణీ చేయకుండా.. వెనక్కు పంపాలన్నారు.

ముక్కడిపేటలో వీధి పేరు మార్చొద్దు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముక్కడిపేట వాసులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ముక్కడిపేటలో ప్రధానవీధికి కొంత మంది ముబారక్ మసీదు వీధిగా నామకరణం చేయాలని చూస్తున్నారని, దానిని వ్యతిరేకిస్తున్నామని ఆ కాలనీవాసులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ముక్కడిపేటకు చెందిన వారు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఐక్యతతో అన్ని మతాల వారు ప్రశాంతంగా జీవిస్తున్న హిందూపురంలో వీధికొక పేరును మార్చడం ద్వారా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. అలాగే పలు చోట్ల కొత్త పేర్లతో బోర్డులను వేశారని, వాటిని గురించి యధావిధిగా పాత పేర్లతోనే కొనసాగించాలని వారు కోరారు. కార్యక్రమంలో ముక్కడిపేట వాసులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం టౌన్: మండలంలోని సంతేబిదనూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కుశల్ హెల్త్ కేర్ క్లినిక్ వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కంటి సంబంధిత వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, పౌష్టికాహారం అందజేశారు. అదే విధంగా తూమకుంట చెక్‌పోస్ట్‌లో విప్రో కేర్స్ సహకారంతో కుశల్ హెల్త్ కేర్ క్లినిక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో విప్రో కేర్స్ ప్రోగ్రాం అధికారులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు ఎంపిక



ఎస్.షాజియా

హిందూపురం టౌన్: ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన పట్టణానికి చెందిన ఎస్.షాజియా 'జగనన్న ఆణిముత్యాలు'కు ఎంపికైంది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ గ్రూప్‌లో ఎస్.షాజియా 962 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ మురళీ మోహన్ తెలిపారు. జగనన్న ఆణిముత్యాలుకు విద్యార్థిని ఎంపిక పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో విద్యార్థినికి నగదు పురస్కారం, మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవించండి



మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

లేపాక్షి: గ్రామీణులు ప్రశాంత వాతావరణంలో జీవించాలని హిందూపురం రూరల్ సీఐ వేణు గోపాల్, ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్ సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కొండూరు గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. వ్యక్తిగత దూషణలకు దూరంగా వుండాలన్నారు. ప్రతిఒక్కరూ స్నేహభావం, సోదరభావంతో మెలగాలన్నారు. ముఖ్యంగా వర్గకక్షలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యేలు శంకర నారాయణ, తిప్పేస్వామి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పెనుకొండ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని కురుబ వాండ్లపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధిని తెలియజేశారు. గ్రామంలో 250 గడపలను తిరిగారు. స్వయంగా సమస్యలు తెలుసుకుంటూ, వాటికి పరిష్కారం చూపుతూ ముందుకెళ్లారు. గ్రామంలో పలువురు పింఛన్, జగనన్న గృహాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారంపై అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలు చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయంగా సమస్యలను తెలుసుకునేందుకే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సమస్యలు తెలుసుకొని ఎక్కడికక్కడ పరిష్కరిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజారంజక పాలన అందించడమే ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గీతా, జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీడీఓ శివశంకరప్ప, సర్పంచ్ నాగమూర్తి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, పోగాకు రామచంద్ర, చెన్నకేశవులు, నరసింహ, రత్నమ్మ, రామాంజనేయులు, మురళి, ఎం.నారాయణ, ముత్యాలు, వై.రాము, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కే ప్రజాదరణ

మడకశిర(అగళి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజాదరణ ఉందని, రాష్ట్ర ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. అగళి మండలం కెంకర, ఉప్పరతొణసనపల్లిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు పేదల కుటుంబాల్లో వెలుగులు నింపాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలకు అండగా నిలబడ్డారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. కులమతాలు, రాజకీయాలకతీతంగా తమ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందన్నారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలను పొందడానికి జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. చంద్ర బాబు ఇచ్చిన హామీలను గాలి కొదిలేయగా వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ రేణుక, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, కన్వీనర్ మహేంద్ర, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంపీటీసీ సురేష్, జేసీఎస్ కన్వీనర్ శివన్న, సర్పంచు నరసమ్మ, మధు, స్థానిక నాయకులు నటరాజు, భోజేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శనిమహాత్ముడి జయంత్యుత్సవం



శీతలాంబ సమేత శనీశ్వరస్వామి

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో స్వామి జయంత్యుత్సవం ఘనంగా నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు అనంతరాం భట్ నేతృత్వంలో ప్రాతః కాల పూజలు, నవగ్రహ మూర్తుల ఏకాదశ వారు రుద్రాభిషేక పూజలు, నవ గ్రహ హోమం, ప్రధాన మూల మంత్ర హోమాలు, గాయత్రి హోమం, మహా పూర్ణాహుతి, కలశోదకమార్జన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి జ్యేష్టాదేవి సమేత శనీశ్వర స్వామి దీపాలంకృత ఉత్సవం వైభవం సాగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్సవం లో ఆలయ సమితి అధ్యక్షుడు కేవి శ్రీనివాస్, ఆనందరావు, సుబ్బనరసింహ తదితర పదాధికారులు పాల్గొన్నారు.

రైతు బీరయ్య మృతికి కారకులపై చర్యలు తీసుకోండి



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

పరిగి: కాలువపల్లికి చెందిన రైతు బీరయ్య మృతికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని కాలువపల్లి గ్రామ రైతులు, ఇటుక బట్టీల యజమానులు కోరారు. ఈమేరకు శుక్రవారం పరిగి తహసీల్దారు కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఇటుక బట్టీల నిర్వహణతో కుటుంబాలను పోషించుకుంటున్న వేలాది కుటుంబాలు ఒకరిద్దరి వ్యవహార శైలితో నష్టపోవాల్సి వస్తోందన్నారు. జీవనోపాధిని దెబ్బతీసేందుకు, ఆర్థిక స్థితి గతులను దిగజార్చేందుకు కొంతమంది ఉన్నతాధికారులకు లేనిపోని ఆరోపణలతో కూడిన ఫిర్యాదు చేయడంతో గత రెండు రోజుల క్రితం తమ గ్రామానికి చెందిన బీరయ్య అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ జయలతకు వినతిపత్రాన్ని అందించారు.

హత్యకు రెక్కీ నిర్వహించారని ధర్నా



పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న గ్రామస్తులు

సోమందేపల్లి: తనను హత్య చేసేందుకు నాగభూషణం రెడ్డి అనుచరులతో కలిసి రెక్కీ నిర్వహించారని, ఈదుళబలాపురం సింగిల్‌విండో చైర్మన్ ఆదినారాయణరెడ్డి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆదినారాయణరెడ్డి గడ్డి వాముల దగ్ధంతోపాటు గ్రామంలో శాంతి భద్రతల సమస్య సృష్టిస్తున్న నాగభూషణం రెడ్డిని అరెస్ట్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి, నిరసన తెలియజేశారు. సింగిల్‌విండో చైర్మన్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన నాగభూషణంరెడ్డి ఓ కేసులో రిమాండ్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చాడని, గురువారం రాత్రి అనుచరులతో కలిసి తన ఇంటివద్ద టపాసులు పేల్చి, మారణాయుధాలతో తిరిగారన్నారు. రాత్రి 1 గంట సమయంలో రెండు గడ్డి వాములు, మూడు చింత చెట్లకు నిప్పుపెట్టారన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారని, దీంతో రూ.లక్ష నష్టపోయినట్లు తెలిపాడు. సర్పంచ్ ఎన్నికల సమయం నుంచి నాగభూషణంరెడ్డి రాజకీయ కక్షతో తనను ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపించారు.

ఎమ్మెల్యే పరామర్శ..

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ గ్రామానికి చేరుకొని ఆదినారాయణ రెడ్డిని పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, వైస్ సర్పంచ్ వేణు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్లా రెడ్డి, ఇమామ్ వలి, నాగరాజు, నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

హిందూపురం టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 8, 9, 34వ వార్డులోని సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, లబ్ధి పొందేలా చూడాలన్నారు. ఆయా సచివాలయాలకు వస్తున్న సర్వీసుల్లో నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా శానిటేషన్ కార్యదర్శులు నిత్యం వార్డులో పర్యటిస్తూ పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు అక్రమ కట్టడాలు, ఖాళీ స్థలాలను గుర్తించాలన్నారు.

వలంటీర్ల సేవలతో ప్రజల సంతృప్తి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు వలంటీర్లు అందిస్తున్న సేవలతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారని సర్పంచ్ అంజినమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ల వందనం కార్యక్రమాన్ని మండలంలోని సచివాలయాలు, ఆర్బీకేల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, వలంటీర్లు తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ల సేవలను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవార్డులు అందింస్తున్నారన్నారు. వలంటీర్ల మరింత ఉత్సాహంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోనిబాయి, ఈఓఆర్డీ శైలజ, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

మడకశిర: రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అనేక పనులపై కార్యాలయానికి వస్తారని, వారితో గౌరవంగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా భూ సమస్యలను రికార్డుల ప్రకారం పరిష్కరించాలన్నారు. ప్రధానంగా పట్టాదారు పాసు పుస్తకాల మంజూరులో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈసందర్భంగా రెవెన్యూ సిబ్బందిని ఎమ్మెల్యేను సన్మానించారు. తహసీల్దార్ బాలాంజినేయులు, ఆర్‌ఐ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూపంపిణీ చేయాలని ఎమ్మెల్యేకి వినతి

నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు భూపంపిణీ చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ నాయకులు హనుమంతు,మంజునాథ్,మహేష్, గోవింద్,మూర్తి, నరసింహ తదితరులు ఎమ్మెల్యే తిప్పేస్వామికి వినతి పత్రాన్ని అందించారు. 8వ విడతలో భాగంగా భూపంపిణీ చేసి పేదలను ఆదుకోవాలని కోరారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

గుడిబండ: ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇంచార్జ్ తహసీల్దార్ మమబూబ్‌పీరా హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో రెవెన్యూ శాఖలో ఎక్కువగా అవినీతి జరుగుతుందని సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారన్నారు. రెవెన్యూ సిబ్బంది ఇకపై అవినీతికి పాల్పడినట్లు తన దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌ఐ, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్ఠం)

హిందూపురం	38.0
పెనుకొండ	41.0
మడకశిర	38.0

దోమలను నిర్మూలిద్దాం

మడకశిరరూరల్: సమష్టి కృషితో దోమలు నిర్మూలిద్దామని మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం పెద్దపల్లి, రేకులకుంట ,ఆర్ అనంతపురం గ్రామాల్లో ఇంటింటా దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా దోమల నిర్మూలన జాగ్రత్తలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి లలితమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయం తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి రమ

సోమందేపల్లి/పెనుకొండ: సోమందేపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆ శాఖ కార్యదర్శి రమ శుక్రవారం తనిఖీ చేశారు. వేసవి శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమె పెనుకొండలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయాధికారి బాషా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సభ్యత్వాల రద్దు

పావగడ: తాలూకాలోని బ్యాడనూరు గ్రామ పంచాయతీ బ్లాక్-1 లో ఇటీవల నిర్వహించిన నాలుగు సభ్యత్వ స్థానాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు రుజువు కావడంతో సభ్యులు నింగప్ప, నాగణ్ణ, లలితమ్మ, రత్నమ్మ సభ్యత్వాలను స్థానిక జేఎమ్‌ఎఫ్ కోర్టు రద్దు పరచింది. అదే విధంగా రెండవ స్థానంలో అధిక ఓట్లను సాధించిన ఆర్ తిప్పేస్వామి, సరోజమ్మ, బాబా ఫకృద్దీన్, సావిత్రమ్మను గ్రామ పంచాయతీ సభ్యులుగా ప్రకటించింది. వారికి స్థానిక తహసీల్దార్ సుజాత అర్హతా పత్రాలు శుక్రవారం అందించారు. ఇదిలా వుంటే బ్లాక్ - 1 లో గెలిచిన నలుగురు అభ్యర్థుల నామినేషన్ పత్రాల్లో ఆస్థి వివరాలకు సంబంధించి సరైన వివరాలు పేర్కొనకపోయినా ఎన్నికల అధికారులు వారిని గెలిచినట్లు ప్రకటించారని ఆరోపిస్తూ గతేడాది అదే గ్రామానికి చెందిన తిప్పేస్వామి కోర్టు ను ఆశ్రయించాడు. ఈ వ్యాజ్యానికి సంబంధించి కొనసాగిన విచారణ అనంతరం కోర్టు వారి సభ్యత్వాలను రద్దు చేసింది. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులు న్యాయమే గెలిచిందని సంతోష పడ్డారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం

పావగడ: కణివేనహళ్లిలో శుక్రవారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం వాటిల్లింది. పట్టణ పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నేత్రావతి, మారుతి దంపతుల ఇంటిలో శుక్రవారం మధ్యాహ్నం ఫ్యాన్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న వారు భయంతో బయటకు పరుగులు తీశారు. మంటలు ఇంటి అంతావ్యాపించి వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. ఘటనలో దాదాపు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

టర్ల్ పుస్తకాల అందజేత

గుడిబండ: వేసవి సెలవుల్లో విద్యార్థులు చదువుకోవడానికి అవసర మైన టర్ల్ పుస్తకాలను శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ శ్రీధర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో చదవడం మాకిష్టం కార్యాక్రమంలో భాగంగా 3,4,5వ తరగతి విద్యార్థులకు టీచింగ్ అట్ రైట్ లెవెల్ పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకోండి

రొద్దం: మండల వ్యాప్తంగా వేరుశనగ కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిణి నివేదిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం ఆధార్, సెల్‌ఫోన్ వెంట తీసుకురావాలన్నారు.

నేడు మండల సమావేశం

హిందూపురం టౌన్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రత్నమ్మ అధ్యక్షతన శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర శుక్రవారం తెలిపారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరు కావాలన్నారు.

26న అగళి మండల మీట్

మడకశిర(అగళి): అగళి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

జోరుగా వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

మడకశిర: నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో విత్తన వేరుశనగ పంపిణీ కోసం ఆర్బీకేల్లో జోరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోందని ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల్లోనే 250 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. మడకశిర మండలంలో 50, గుడిబండ 80, అగళి 30, రొళ్ళ 40, అమరాపురం మండలంలో 50 మంది చొప్పున రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

22న కలెక్టరేట్ ముట్టడి

రొద్దం: ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ఈనెల22న కలెక్టరేట్ ముట్టడి చేస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయక కార్యదర్శి గంగాధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కంచిసముద్రం, ఆర్.లోచెర్ల గ్రామాల్లో ఉపాధి కూలీలతో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నారాయణ పాల్గొన్నారు.

మసీదు వద్ద పారిశుధ్య పనులు

హిందూపురం టౌన్: మున్సిపల్ పరిధిలోని మారుతీనగర్‌లో ఉన్న మసీద్‌దే అబుబకర్ మసీద్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. మసీద్ వద్ద నమాజ్ చదువుకోవడానికి, వెళ్లడానికి ఇబ్బందిగా ఉండడంతో మసీదు పెద్దలు, ముతవల్లీలు విషయాన్ని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి చదును చేయించారు. ఈ సందర్భంగా మసీద్ పెద్దలు, ముతవల్లీలు ఎమ్మెల్సీతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫయాజ్, ఫరూక్, దాదు, అయాజ్, జబీవుల్లా, బాబావలి పాల్గొన్నారు.

మూడు వాహనాల ఢీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై మూడు వాహనాలు ఢీ కొన్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఓ లారీ రోడ్డువైపున వై జంక్షన్ వద్ద ఆగి ఉండగా, బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొనింది. అదేసమయంలో బళ్లారికి వెళ్తున్న మరో బొలేరో బస్సును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న నీలకంఠకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

పెనుకొండ: పట్టణంలో శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు హరి, రమేష్ తదితరులు మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

ఓటరు జాబితాల్లో సవరణలు చేపట్టండి

మడకశిర: ఓటరు జాబితాల్లో సవరణలు చేపట్టాలని స్థానిక తహసీల్దార్ బాలాంజనేయులు సిబ్బందని ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలం, మున్సిపాలిటీ పరిధిలోని బీఎల్‌ఓల సమావేశం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఏడాది పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని, ఈనేపథ్యంలో గ్రామస్థాయిలో బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాల్లో సవరణలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కొత్త ఓటర్లను చేర్పించడంతో పాటు మృతి చెందిన ఓటర్లను జాబితాల నుంచి తొలగించాలని కోరారు. పకడ్బందీగా ఓటర్ల జాబితాల్లో సవరణ చేపట్టాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ రావు, ఎన్నికల విభాగం డీటీ మారుతి ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయం ఏఓ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

అమరాపురం: స్థానిక కెనరా బ్యాంకులో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు మేనేజర్‌గా వెళ్లిన ఫణీంద్ర స్వామికి రైతులు, ఖాతాదారులు, వ్యాపారస్తులు ఘనంగా శాలువా పూలమాలలతో సన్మానించారు. శుక్రవారం సాయంకాలం స్థానిక కెనరా బ్యాంకులో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు ఫణీంద్రస్వామి సేవలను కొనియాడారు.

వైద్యశిబిరం

అమరాపురం: స్థానిక వాసవీ కల్యాణమంటపంలో వాసవీ యువక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరు సప్తగిరి నర్సింగ్ హోం డాక్టర్లు హనుమంతరాయప్ప, తేజస్విని, సాదుబన్నాల్ 216 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 16 మందికి గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు కో ఆర్డినేటర్ ఆనంద్ తెలిపారు. వీరికి బెంగళూరులోని సప్తగిరి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

రొళ్ల: కాకి గ్రామంలో ఇటీవల నరసింహమూర్తి అనే వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం మృతుడు నరసింహమూర్తి భార్య హనుమక్కకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు నగదును ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీ, నాయకులు లోకేష్, యరగుంటప్ప అందజేశారు. వీఆర్వో వేణుగోపాల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.